


భూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
బుధవారం | 25 మార్చి , 2026 | పేజీలు : 07

# వంట గ్యాస్ కృత్రిమ కొరత

బయట పడుతున్న అక్రమ నిల్వలు

బ్లాక్ మార్కెట్‌లో డొమెస్టిక్ సిలిండర్ రూ.1500 నుండి రూ.1800

కమర్షియల్ రూ.3 వేల నుండి రూ.4వేలు

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంతో గ్యాస్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వంట గ్యాస్ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. దీంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు నిర్వహిస్తున్న దాడుల్లో గ్యాస్ అక్రమ నిల్వలు పెద్దఎత్తున బయటపడుతున్నాయి. దీనిని ఆసరాగా చేసుకొని వినియోగదారులకు అందజేయాల్సిన గ్యాస్‌ను పెద్దఎత్తున పక్కదారి పట్టిస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌లో డొమెస్టిక్ (గృహ వినియోగం) సిలిండర్‌ను రూ.1500 నుండి రూ.1800 కు, కమర్షియల్ రూ.3వేల నుండి రూ.4వేలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.




## భార్య కాపురానికి రావట్లేదని భర్త మనస్తాపంతో ఎలుకలమందు తాగి అత్మహత్యాయత్నం

### చికిత్స పొందుతూ మూడేళ్ల పసిపాప మృతి, తండ్రి పరిస్థితి విషమం

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : తన భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి కూతురుకు విషం ఇచ్చి తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.కుటుంబ సభ్యుల పిర్యాదు ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మ గూడెం గ్రామానికి చెందిన వరి కుప్పల రవి(30) కి మాడ్గుల మండలానికి చెందిన స్వాతితో గత నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అయితే వీరి వైవాహిక జీవితం కొద్దికాలం సాఫీగానే సాగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు కూడా జన్మనిచ్చారు. అయితే ఇటీవల భార్యాభర్తల మధ్య వివాదం మొదలు కావటంతో భార్య తన ఎనిమిది నెలల పాపను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. మరో మూడేళ్ల కుమార్తె వరికుప్పల మేఘన తన తండ్రితోనే ఉంటుంది. ఈనెల 21న తీవ్ర మనస్తాపం చెందిన రవి తన కూతురుకు ఎలుకల మందు పోసి తాను కూడా తాగాడు. సాయంత్రం పరిస్థితి విషమించడంతో వీరిద్దరిని మెరుగైన చికిత్స కోసం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే సోమవారం కూతురు మేఘన మృతి చెందింది. ప్రస్తుతం తండ్రి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఆత్మహత్య ప్రయత్నం చేసిన రవి తండ్రి జరిగిన సంఘటనపై పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు.



## సకాలంలో పరిశ్రమలకు అనుమతులు ఇవ్వాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సకాలంలో అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో డిఐపిసి, టిఎస్ ఐపాస్ కమిటి సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులను పరిశీలించి సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో 36 పరిశ్రమలకు గాను 63 అప్రూవల్స్ వివిధ శాఖల ద్వారా వచ్చాయని వాటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు నిబంధనల మేరకు ఆమోదించాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి సంబంధించిన టీప్రైడ్ పథకం కింద 82 యూనిట్లు మంజూరు చేస్తూ తీర్మానించామన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టి సీతారాం, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ బి యాదగిరి, డిపిఓ కె యాదగిరి, ఎస్‌సి డెవలప్‌మెంట్ అధికారి దయానంద రాణి, ఎస్‌టి డెవలప్‌మెంట్ అధికారి కె శంకర్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి ఇతర అధికారులు పాల్గొన్నారు.





## సాగర్ సందర్శించిన టూరిజం హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ విద్యార్థులు


ప్రజాపక్షం/నందికొండ: అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్ ను మంగళవారం హైదరాబాదులోని నేషనల్ ఇనిస్టిట్యూట్‌ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ (నితిమ్ )విద్యార్థులు సందర్శించారు. సాగర్ స్టడీ టూర్‌లో భాగంగా టూరిజం లాంచిల్లో నాగార్జునకొండ మ్యూజియం సందర్శించారు. అనంతరం బుద్ధవనములోని బుద్ధ చరితవనం, ధ్యానవనం, స్తూపవనాలనువీక్షించిన అనంతరం మహాస్తూపం సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలు తెలిపే లఘు చిత్రాన్ని వీక్షించారు.మహా స్థూపం లోని ధ్యాన మందిరంలో వీరిచే బుద్ధ వనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన ధ్యానం చేయించారు. వీరికి టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునసాగర్ డ్యాం,నాగార్జునకొండ,బుద్ధవనం విశేషాలను వివరించారు.నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం హాస్పటాలిటీ మేనేజ్మెంట్ సంబంధించిన ఫ్యాకల్టీలు శిరీష,మహేశ్వర్ రెడ్డి,యాదగిరి ఉన్నారు.

## పంచాయతీ కార్యదర్శులు విధులకు డుమ్మా

### ఒంటిపూట విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి

### ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

ప్రజాపక్షం/గరిడేపల్లి: మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు విధులకు డుమ్మా కొడుతూ పలు గ్రామ పంచాయతీలలో ఖాళీ కుర్చీ దర్శనమిస్తున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళితే మండలంలోని పొనుగోడు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉదయం కార్యాలయానికి వచ్చి ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వేసుకుని మధ్యాహ్నం 230 గంటల తర్వాత చెప్ప పెట్టకుండా వెళ్లిపోతాడు. మధ్యాహ్నం తర్వాత ఎవరు వెళ్లినా కార్యదర్శి అందుబాటులో ఉండటం లేదు. ఎవరైనా ఫోన్లో అడిగితే కలెక్టర్ కార్యాలయం, ఎంపిడివో కార్యాలయంలో ఉన్నాను అని సమాధానం చెప్తాడు. నిజానికి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కన్నా ఇతర కార్యాలయాల్లో ఉండటం ఏమీటని ప్రజలు అంటున్నారు. అధికారుల అలసత్వమా లేక ఎవరు ఏం చేయలేరని ధీమా, అడిగే వారు లేరని ఆడిందే ఆటగా కార్యదర్శి నిత్యం విధులకు డుమ్మా కొడుతూ తన సొంత పనులు చక్కబెట్టుకుంటున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు కార్యదర్శిపై చర్యలు తీసుకుని పంచాయతీ కార్యదర్శి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.





## ప్రభుత్వం నాటకాలను ప్రోత్సహించాలి

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : ప్రభుత్వం తెలుగు పద్య నాటకాలను ప్రోత్సహించాలని నాటక సమాజాల సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిలకత్తుల పుల్లయ్య, గుండు వెంకటేశ్వర్లు కోరారు. మండలం లోని పొట్లపాడు గ్రామంలో సోమవారం రాత్రి శ్రీ సీతారామాంజనేయ స్వామి కళాకారులచే తడకమళ్ళ రామచంద్రరావు రచించిన దమయంతి స్వయంవరం నాటకమును ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు పద్య నాటకాలను అంతరించిపో కుండా నేటి కాలపు యువతీ యువకులను ప్రోత్స హించి అట్టి కళలకు జీవం పోసే విధంగా పాలకులు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంబాలపల్లి శ్రీనివాస్, బాసంపల్లి యాదగిరి, బండి రాధాకృష్ణారెడ్డి, వెల్పుల వెంకన్న, ధనియాకుల వెంకటేశ్వర్లు, చల్లా సత్యనారాయణ రెడ్డి, బెల్లంకొండ యాదగిరి తదిత రులు పాల్గొన్నారు.

## ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : మండల కేంద్రంలో వ్యాపార లావాదేవీలను క్రమబద్ధీకరించేందుకు గ్రామ పంచాయితీ పాలకవర్గం నడుం బిగించింది. గ్రామంలో వ్యాపారం నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ విధిగా గ్రామ పంచాయితీ నుండి ట్రేడ్ లైసెన్స్ పొందా లని సర్పంచ్ ఒగ్గు రవి స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం పంచాయితీ కార్యదర్శి నాగరాజు, కారోబార్ కట్టోజ్ శ్రవణ్ కుమార్‌లతో కలిసి ఆయన వ్యాపారస్తులందరికి అధికారికంగా నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో వ్యాపారస్తుల పాత్ర కీలకమన్నారు. ప్రతి వ్యాపార సంస్థ లైసెన్స్ కలిగి ఉండడం ద్వారా ఆ వ్యాపారానికి చట్టబద్ధత లభిస్తుందని వివరించారు.

## అవగాహనే ఆయుధం



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : క్షయ వ్యాధి పట్ల భయం వద్దు అవగాహనే మన ఆయుధం అందరం కలిసిక ట్టుగా పోరాడితేనే టిబి రహిత సమాజాన్ని నిర్మించగల మని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ అన్నారు. మంగళవారం ప్రపంచ టిబి దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా వద్ద నిర్వహిం చిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కని పిస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, నర్సులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



ప్రజాపక్షం/మోతె : మండల కేంద్రంలో కబ్జా చేస్తున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని తహశీల్దార్ యం వెంకన్నకు మంగళవారం తహశీల్దార్ కార్యాల యంలో మోతె గ్రామ పంచాయితీ పాలక వర్గం విన తిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దోసపాటి అనురాధ, ఉపసర్పంచ్ బొక్క ఉపేందర్ రెడ్డిలు మాట్లాడుతూ సుమారు 1997 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు సర్వే నెంబర్ 238లో గల 2 ఎక రాల 15 గుంటల భూమిని నిరుపేదల కోసం ఇచ్చా రన్నారు. ఆ జాగాలలో ఎలాంటి ఇంటి నిర్మాణం చేపట్టకపోవడంతో తిరిగి డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు తీసుకున్నా రన్నారు. ఇండ్లు నిర్మించగా ఖాళీ భూమిని కొంత మంది పెన్సింగ్‌తో, అక్రమంగా తాత్కాలిక ఇంటి నిర్మాణాలు చేపడుతూ కబ్జా చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా క్రీడా ప్రాంగణం కోసం కొంత భూమిని కేటాయించగా దానిని కూడా వదలకుండా ఆక్రమిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తహశీల్దార్ ఇట్టి విషయమై అక్రమ ఆక్రమ ణలను తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వార్డు సభ్యులు వీరబాబు, నవీన్, రాము, తరుణ్, గ్రామ కార్యదర్శి కె కవిత పాల్గొన్నారు.

## చండూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/చండూరు: నల్లగొండ జిల్లా లోని రెవిన్యూ డివిజన్ కేంద్రమైన చండూరు మున్సిపల్ పట్టణ కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీవో శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 2026 27 విద్యా సంవత్సరం నుండి ఆధునిక వసతులతో 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రారంభిస్తుండగా అందులో ఒకటి చండూరులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మునుగోడు నియోజకవర్గంలో ఉన్న ఆరు మండలా లలో మునుగోడు , చౌటుప్పల్, నారాయణపురం , మర్రిగూడ , నాంపల్లి ఐదు మండలాలలో మోడల్ స్కూల్ , గురుకుల పాఠశాలలు , ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఉన్నందున చండూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొత్త పాటి సతీష్ , మాజీ ఎంపిపి తోకల వెంకన్న, పార్టీ మండల అధికార ప్రతినిధి బొడ్డు సతీష్ గౌడ్, చొప్పరి దశరథ , కౌన్సిలర్ కొండ్రెడ్డి మధు, కర్నాటి మల్లేశం , ఇరిగి గురునాథం , ఇరిగి రామకృష్ణ , నాగరాజు, జగదీష్ , గౌస్, అబ్దుల్ పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకున్న చిన్నారులు




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: పట్టణ కేంద్రంలోని ది మాస్టర్ మైండ్స్ హై స్కూల్‌లో చిన్నారి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కత్తుల అరుంధతి హాజరయ్యారు.ఈ సంద ర్భంగా యూకేజీ39,ఐదవ తరగతి పూర్తి చేసిన 18 మంది చిన్నారి విద్యార్థులకు ఆమె గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు.ఈ సందర్భంగా మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కత్తుల అరుంధతి,పాఠశాల చైర్మన్ గుండెబోయిన జానయ్య యాదవ్‌లు మాట్లా డుతూ చిన్నారుల జీవితంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు.వారి విద్యా ప్రయా ణంలో ఒక అధ్యాయం ముగిసి,కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టిన సందర్భమని తెలిపారు.చిన్న టోపీలు,గౌన్లు ధరించిన చిన్నారులు వేదికపై మెరిసి పోతూ,తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల మధ్య ఆనంద భరిత వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమం ఒక దశ ముగింపుకి సూచికగా,మరో కొత్త అవకాశాల దిశగా ప్రారంభమైన హృద్యమైన సందర్భంగా నిలి చింది.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఇన్ చార్జ్ క్రిస్టోఫర్,ఉపాధ్యాయులు జి.వెంకటేశ్,చంద్రశే ఖర్,నూర్,విజయ నిర్మల,అస్మా,రుచిత,అరుణ జ్యోతి,హేమలత,సనోబార్,అశ్విని,స్వర్ణ, దివ్య తదిత రులు,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే రూ.25వేలు జరిమానా!




ప్రజాపక్షం/హాలియా: మైనర్లు వాహ నాలు నడిపితే వారికి 25 వేల రూపా యల జరిమానా విధించబడుతుందని హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలి పారు. మంగళవారం హాలియాలో మైనర్లు వాహనాలు నడపకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు నడిపేందుకు కనీస వయసులేని వారికి వాహనాలు ఇవ్వడం వలన డ్రైవింగ్ లో కనీస అను భవం లేక వారి ఇష్టానుసారంగా వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. వీరికి వాహనాలు ఇచ్చి ప్రోత్సహించడం వలన వయసు రిత్యా మితిమీరిన వేగంతో వెళ్లి ఇతరులకు ఇబ్బం దులు కలిగిస్తూ వారు ప్రమాదాల బారిన పడుతున్నా రని తెలిపారు. వాహనాలు నడిపే వయసులేని చిన్నారులు వాటిని నడిపితే 25 వేల రూపాయల జరి మానా విధించడంతోపాటు తల్లిదండ్రులకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని ఎస్ఐ తెలిపారు. కాబట్టి తల్లి దండ్రులు చిన్నారులకు వాహనాలు ఇవ్వకుండా కఠి నంగా వ్యవహరించాలని సూచించారు. హాలియాలో వాహనాలు నడుపుతున్న చిన్నారులను పట్టుకొని వారికి ప్రమాదాలు తన వల్ల కలిగే అనర్థాల గురించి వివరించి హెచ్చరించారు. వాహనాల రిజిస్ట్రేషన్ కూడా రద్దు అవుతుందని సూచించారు.



## ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

ప్రజాపక్షం/చండూరు: చండూరు మండలంలో బంగారిగడ్డ గ్రామ పంచాయితీని ఒక ఆదర్శవంతమైన గ్రామ పంచాయితీగా తీర్చిదిద్దుటకు గ్రామ ప్రజలు సహకరించాని గ్రామ సర్పంచ్ బోయ పల్లి సునీతశ్రీనివాసులు అన్నారు. అందులో భాగంగా మంగళ వారం ఒక అడుగు ముందుకేసి సర్పంచ్ సునీత శ్రీనివాసులు ఉప సర్పంచ్ ఎండి మహబూబ్ సమక్షంలో గ్రామానికి చెందిన డాక్టర్ మహమ్మద్ ఖాసీం మనుమడు ఎండి ఖాసీం తన వంతుగా 500 స్టీల్ ప్లేట్ లు, 500 స్టీల్ గ్లాసులు గ్రామ ప్రజలకు అందజేయవలసి నదిగా మంగళవారం ప్లేట్లు , గ్లాసులు లను సర్పంచ్ కు అందజే శారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఏరుకొండ కోటి , వార్డు సభ్యులు కాటపల్లి విజయ , బోయపల్లి సాయికుమార్ , బి.సాయి , ఇర్గి సుధాకర్ , లింగస్వామి, కొండ్రెడ్డి సాయి , తలారి ముత్తయ్య , ఐతగోని మహేశ్వరిపాల్గొన్నారు.

## నేరడలో పశువైద్య శిబిరం



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడ గ్రామంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటి ఆధ్వర్యంలో మంగళవారం రోజున పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబి రాన్ని మార్కెట్ కమిటి చైర్మన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా గాలి కుంటు బారిన పడి పశుసంపద కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవా లని రైతులకు సూచించారు. ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలను తీసుకోవాలన్నారు. మండల వైద్యులు డాక్టర్ వి అభినవ్, డాక్టర్ జె అమరేందర్‌లు ఈ శిబిరంలో పాల్గొని సుమారు103 గేదెలకు, 58 ఆవులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. 36 పశు వులకు వైద్య చికిత్స అందజేసి మందులను సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిర్యాల వెంకటేశం, ఎఎంసి కార్య దర్శి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి




ప్రజాపక్షం/చిట్యాల: రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న డిమాండ్‌తో సిఐటియు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెలుతున్న మున్సిపల్ కార్మికుల ర్యాలీని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలలో కార్మికులు అందిస్తున్న సేవలను గుర్తించాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు అవిశెట్టి శంకరయ్య, మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు పాల లక్ష్మయ్య, మేడి శోభ, జనపాల జ్యోతి పాల్గొన్నారు.

## 29న స్మారక భవనం శంకుస్థాపన

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : ఈనెల 29న అమరజీవి, కామ్రేడ్ ధని యాకుల గురవయ్య స్మారకార్థం మండల కేంద్రంలో భవన నిర్మా ణానికి శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన జీవితాంతం పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడుతూ, ఎర్రజెండా ఎత్తిపెట్టి ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన యోధుడు గుర వయ్య అన్నారు. జిల్లా కమిటి సభ్యులు ధనియాకుల శ్రీకాంత్



## పట్టణంలో ఆపరేషన్ రోప్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆపరేషన్ రోప్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు. మంగళవారం కుడకుడ రోడ్డులో ఉన్న ఆక్రమణలను మున్సిపాలిటి అధికారులతో కలిసి తొలగించారు. అలాగే రోడ్డుపై ఉన్న మట్టికుప్పలు, చెత్తను, రాళ్లను తొలగించి రోడ్డు సక్రమంగా కనిపించేలా, వినియోగించేలా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించడానికి, పాదాచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా, ప్రమాదాలు జరగకుండా చేయడం, ఆక్రమణలు, అనధికారిక పార్కింగ్ తొలగించడం, వాహనాలు క్రమపద్ధతిలో వెళ్లడం అరైవ్ అలైవ్, రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా ఆపరేషన్ రోప్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రేడ్ లైసెన్సుల పేరుతో ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట వ్యాపార, వాణిజ్య సంస్థల వారికి మున్సిపాలిటి వారికి చెల్లించాల్సిన ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించి స్కానర్స్ పంపి వెంటనే చెల్లించాలని వచ్చే మెసేజ్‌లపట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, కమీషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో సూచించారు. వారిని ఆన్‌లైన్ మోసగాళ్ళుగు గుర్తించాలన్నారు. కార్యాలయం నుంచి వచ్చే వార్డు అధికారులకు మాత్రమే ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించాలని కోరారు. ట్రేడ్ లైసెన్స్‌ల చెల్లింపు విషయంలో ఎలాంటి సమాచారం కావాలన్నా మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ యాదగిరి సెల్ నంబర్ 955006127ను సంప్రదించవచ్చని తెలిపారు. ఫేక్‌గా వచ్చే మెసేజ్‌లకు ఎవరూ స్పందించి నష్టపోవద్దన్నారు.

## బేటి బచావో బేటి పడావో



**ప్రజాపక్షం/చింతలపాలెం :** బాలికలు చదువుకొని ఉన్నత స్థానంలో ఉండాలని, భ్రూణ హత్యలు నివారించాలని గుడిమల్కాపురం గ్రామ సర్పంచ్ పోల్నేడి నరసమ్మ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని గుడిమల్కాపురం గ్రామ పంచాయితీ నందు నిర్వహించిన బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ భారతదేశంలోని బాలికల సంక్షేమం కోసం, వారి చదువుల కోసం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేడిశెట్టి నరసింహారావు, పంచాయితీ కార్యదర్శి అనిత కుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న వారిపై చర్యలు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని లంకల పల్లి గ్రామంలో మంగళవారం బెల్ట్ షాప్స్ నిర్వహిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు రైడ్ నిర్వహించి మానుపాటి శ్రీను కిరణ్ షాపులో సుమారు 8 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపారు,గ్రామాలలో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/నూతనకల్ :** కేసుల ధర్యాప్తును వేగవంతం చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. మంగళవారం మండల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రికార్డు త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు, పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపట్ల మర్యాదగా ప్రవర్తించడంతోపాటు వారికి భరోసా కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రజా సమస్యలపై సమాచారం అందిన వెంటనే వేగంగా స్పందిస్తూ బాధితుల వద్ద నుండి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సామాజిక కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది అందరూ ఐక్యమత్యంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యాపారంతో పాటు సామాజిక సేవ అభినందనీయం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్‌లో క్రెడాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని నిర్వహించడం గొప్ప సామాజిక సేవ అని కొనియాడారు. వ్యాపారంతో పాటు ప్రజాసేవను కొనసాగించడం ఆదర్శప్రాయమని తెలిపారు.ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ జానీ రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ బస్టాండ్ నుంచి ప్రతిరోజూ సుమారు 40 వేల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారని,వారికి తాగునీటి సౌకర్యం కల్పించడంలో క్రెడాయ్ సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్రెడాయ్ అధ్యక్షుడు బుర్రి శ్రీనివాస్ రెడ్డి, అమంచి రాజలింగం,కార్పొరేటర్లు అబ్బగోని కవిత రమేష్,పిల్లి కృష్ణ,బండారు ప్రసాద్,ఏచూరి భాస్కర్,ప్రధాన కార్యదర్శి నాంపల్లి మనోహర్, కోశాధికారి దూదిపాల్ వెంకటరెడ్డి,మందడి వెంకటరెడ్డి, ఆవుల శ్రీనివాస్,పృథ్వి,మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,అలుగుబెల్లి కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవాలి




**ప్రజాపక్షం/హాలియా:** హాలియా మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని వార్డుల కౌన్సిలర్లు నిధులు సమకూర్చుకోవడంలో బాధ్యతగా వ్యవహరించాలని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు.మంగళవారం హాలియా మున్సిపాలిటీ కార్యాలయంలో 2026 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాలియా మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవడానికి మార్గాలు అన్వేషించి దాని ద్వారా వచ్చే నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని చెప్పారు.ప్రస్తుతం హాల్య మున్సిపాలిటీ లో నిధుల కొరత తీవ్రంగా ఉందని వచ్చే ఆదాయాన్ని కంటే ఎక్కువగా ఖర్చులు ఉన్నాయని దీనివలన మిగులు బడ్జెట్ లేక అభివృద్ధికి అవరోధం ఏర్పడుతుందని గుర్తు చేశారు. మిగులు బడ్జెట్ లేకపోవడం వలన హాలియా అభివృద్ధికి నూతనంగా ఏర్పాటైన కౌన్సిలర్లు అందరూ ఏకతాటిపై కలిసిమెలిసి నిధుల రాబడికి కావలసిన ప్రణాళికలు ఏర్పాటు చేసుకొని దానికి అనుగుణంగా నిధులు రాబట్టాలని చెప్పారు.హాలియా మున్సిపాలిటీ అభివృద్ధికి మన ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి నిధులు సమీకరణకు కావలసిన ప్రణాళికలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపారని గుర్తు చేశారు. 2026/27 సంవత్సరానికి ఎంత బడ్జెట్ అవసరమో ఈ సమావేశంలో వివరించారు.అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డిని కౌన్సిల్ సభ్యులు సన్మానించారు.ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు అన్నపూర్ణ,కడమంచి ప్రమీల,చిట్టిపోలు శ్రీదేవి, బొంగరాల యేసు రాజు,చెరుపల్లి ముత్యాలు, జబీన్, పిల్లి చంద్రకళ,ప్రసాద్ నాయక్, ఎడవల్లి మేరీ తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక సమీక్ష కార్యక్రమం

**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య సాహిత్యం సమాలోచనం' అను పుస్తక సమీక్షా కార్యక్రమం జరిగింది.కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య గొప్ప సాహితీవేత్తయని,తన ఇంటినే గ్రంథాలయంగా మార్చి సమాజానికి ఎనలేని సేవ చేస్తున్నారని,మహాకవి దాశరథి పురస్కారమే కాకుండా, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని కూడా అందుకున్న మహనీయుడని,అటువంటి వారి సాహిత్యం మీద సమగ్రంగా జాతీయ సదస్సు నిర్వహించడమే కాకుండా పుస్తకంగా తీసుకురావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు.ఈ పుస్తక సంపాదకులు, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ జాతీయ సదస్సులో పాల్గొని పత్ర సమర్పణ చేసిన 31 మంది ఆచార్యుల,పరిశోధక విద్యార్థుల వ్యాసాలను పుస్తక రూపంగా తీసుకురావడం జరిగిందన్నారు.ఈ పుస్తకాన్ని మూసీ ప్రత్యేక సంచికగా వెలువరించిన ఆ పత్రిక నిర్వాహకులు ఆచార్య సాగి కమలాకర్ శర్మ గారికి,ప్రచురించిన కూరెళ్ల ఫౌండేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావుతో పాటు అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.





## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రకృతి సంబంధిత వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి అన్నారు. ఇన్నో యాత్ర కార్యక్రమంలో భాగంగా  జిల్లాకు విచ్చేసిన విద్యార్థులు,స్టార్టప్‌ర్లతో మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇన్నో యాత్ర ద్వారా నూతన ఆలోచనలు ప్రోత్సహించేందుకు వివిధ జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం,స్టార్టప్ అవకాశాలు మరియు స్వయం ఉపాధిపై మార్గం నిర్దేశం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్,హార్టికల్చర్ అధికారి అనంతరెడ్డి,ఆర్ డబ్ల్యూఎస్ డీఈ సంపత్ కుమార్, డిఆర్‌డిఏ ఏపీడి శ్రవణ్ కుమార్,ఈడిఎం దుర్గారావు,ఇనోయాత్ర నిర్వాహకులు యాని,ఇనోయాత్ర విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించుటకు త్వరలోనే ఒక కమిటీని వేస్తామని ప్రకటించి నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు పేర్కొన్నారు.మంగళవారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్ లో గల మహాత్మ జ్యోతిబాపూలే బీసీ భవన్‌లో జరిగిన ఆసంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్,పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్‌లు త్వరలోనే ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించుటకు ఒక కమిటీని వేస్తామని చెప్పారని ఈకమిటీని త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు.  ఈకార్యక్రమంలో మారం సంతోష్ రెడ్డి,వనం చంద్రమౌళి,ఏళ్ల చంద్రారెడ్డి,బొమ్మిడి లక్ష్మీనారాయణ కూతురు కృష్ణమూర్తి,కొట్టం రవి, ఈశ్వరరావు,వెంకటేశ్వరరావు,బంద్ రుద్రమ్మ,కంది సూర్యనారాయణ,బూరుగు మల్లయ్య,గంగుల సత్యనారాయణ,కోత్వాల్ సత్యనారాయణ ,కోయల వెంకట నారాయణ, విద్యాసాగర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నూతనకల్ :** తుంగతుర్తి నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ మండలంలోని పలు గ్రామాలలోని కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. పెద్దనెమిల గ్రామానికి చెందిన ప్రజాపక్షం మండల విలేకరి గొడిశాల యాదగిరి ఇటీవల తాడిచెట్టు పై నుండి కింద పడడంతో గాయాలు కాగా ఆయనను పరామర్శించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపిటిసి చురకంటి జానయ్య యాదగిరి రెడ్డిని, బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు కనకం గణేష్‌ను పరామర్శించారు.  బిఆర్ఎస్ నాయకులు నాగెల్లి వీరస్వామి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దిర్శనపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు చక్రధర్ రమేష్‌లు రోడ్డు ప్రమాదంలో గాయపడగా పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్, నాయకులు బత్తుల సాయిల్ గౌడ్, సర్పంచులు చురకంటి లావణ్య మధుసూదన్ రెడ్డి, మహేశ్వరం మల్లికార్జున్ పాల్గొన్నారు.





## పద్మ మృతదేహానికి నివాళులు

**ప్రజాపక్షం/రామన్నపేట** : పట్టణ కేంద్రానికి చెందిన దేవనక పద్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు సందర్శించి పూలమాలేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గరిక సత్య నారాయణ,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జమీరుద్దీన్,ఉప సర్పంచ్ మోటే రమేష్,వనం చంద్రశేఖర్, మహమ్మద్ నాసర్ పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్‌లో వేడుకలు



**ప్రజాపక్షం/రామన్నపేట** : తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఆలీఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) అభ్యర్థులుగా మందడం శ్రీనివాసరావు,సిహెచ్ శైలజ పోటీ చేయగా ఇద్దరు విజయం సాధించారు.ఈ సందర్భంగా రామన్నపేట బార్ అసోసియేషన్ లో స్వీట్లు పంచి వేడుక జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐ లు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి,బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి మజీద్,ఉపాధ్యక్షులు యాదాసు యాదయ్య,హనుమంతు గౌడ్,ఐలు జిల్లా ఉపాధ్యక్షులు జగతయ్య పాల్గొన్నారు.

## ఆపన్నహస్తం ఎల్ఒసి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి**: అత్యవసర వైద్య సేవలలో బాధితులకు ప్రభుత్వం అందించే ఎల్ఓసి ఆపన్న హస్తమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పెద్దగూడెం గ్రామ వాసి కాసుల నర్సింహాకు ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌వోసిని బాధితుడి భార్యకు మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. మాజీ సింగిల్ విండో చైర్మన్ పక్కిరు మల్లా రెడ్డి, సర్పంచ్ పక్కిరు లత నర్సి రెడ్డి, గట్టు రాంరెడ్డి, మన్నే ప్రభాకర్ రెడ్డి, ఏలూరు బాల్ రెడ్డి, 4 వ వార్డు మెంబెర్ కాసుల మల్లేష్ గౌడ్, బాధ్యత కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ చెక్కు పంపిణీ చేశారు.

## రెండు పూటల ఫోటో విధానాన్ని రద్దు చేయాలి

**ప్రజాపక్షం/నకిరేకల్** :ఉపాధి హామీ పనుల వద్ద రెండు పూటల ఫోటోలు తీసే నిబంధనను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్న వెంకులు డిమాండ్ చేశారు. మంగళవారం నకిరేకల్ మండలంలోని నోముల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులులగిశెట్టి శ్రీనివాసు, మండల అధ్యక్షులు మర్రి బక్కయ్య, మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య,మాచర్ల ఎల్లమ్మ,రాధిక, మమత పాల్గొన్నారు.

# రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/త్రిపురారం:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ సూచించారు. మంగళవారం ఆయన ఆకస్మికంగా తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత,సమర్థవంతమైన సేవల కోసం రికార్డుల నిర్వహణ అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ,ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు.విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఆలస్యం లేకుండా సకాలంలో జారీ చేయాలని, ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే భూ భారత కార్యక్రమంలో భాగంగా భూమి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని తెలిపారు.ఈ తనిఖీ సందర్భంగా తహసీల్దార్ గాజుల ప్రమీల, ఆర్ఐ సైదులు , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో మహాకుంభాభిషేకం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పోచంపల్లి మండలం శివారెడ్డి గూడెం గ్రామంలో సీతారామ ఆంజనేయ స్వామి దేవాలయ 24వ వార్షికోత్సవంలో భాగంగా రేపు మహాకుంభాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయ నిర్మాణ వ్యవస్థాపకులు చైర్మన్ మేకల రామకృష్ణారెడ్డి తెలిపారు. మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాలలో నేడు మహా యజ్ఞం ఎల్లుండి శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని సీతారాముల కళ్యాణం కనుల పండువగా జరగనున్నట్లు చెప్పారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి లకు ముఖ్య అతిథులుగా హాజరు కావాలని గ్రామ సర్పంచ్ బొక్క మల్లారెడ్డి ఉపసర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్ లు ఆహ్వాన పత్రికలను అందజేసిన విషయం తెలిసిందే. వైస్ చైర్మన్ వారాల వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వారాల రామచంద్రారెడ్డి, కోశాధికారి బుగ్గ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల చొక్కా రెడ్డి, దొంతల ముని భగవాన్, మేకల రవీందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఉత్సవ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో ఉన్నారు.

# రైతులు పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



**ప్రజాపక్షం/గుండాల**: ప్రతి రైతు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని సర్పంచ్ మంజుల ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గంగాపురం గ్రామంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండల పశువైద్యాధికారి డా. యాకుబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ మంజుల ఆంజనేయులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పశువులను సీజనల్ వ్యాధుల నుండి రక్షించేందుకు ప్రభుత్వం అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని అన్నారు. అనంతరం సుమారు 107 పశువులకు టీకాలు వేయడం జరిగింది. ఈకార్యక్రమంలో విజయ డైరీ చైర్మన్ అలీం, వార్డు సభ్యులు రాజ, గోపాల మిత్రలు గోవింద్, కృష్ణ, నరేష్, శ్రీను, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాతృదేవోభవ చారిట్రబుల్ ట్రస్టు సోసైటీ కోదాడ అధ్యక్షురాలు పబ్బా గీతాదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలోని శ్రీపార్వతి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం నందు మాతృదేవోభవ చారిట్రబుల్ ట్రస్ట్, హైద్రాబాద్‌కు చెందిన యశోధ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ప్రముఖ వైద్యులు మాట్లాడుతూ ఈ శిబిరానికి 300 మందికి ఉచితంగా పరీక్షలు షుగర్, బిపి, ఈసిజి, 2డి ఎకో లాంటివి నిర్వహించి మందులు అందజేసినట్లు, కొంతమందికి గుండెజబ్బులు ఉన్నవారిని హైద్రాబాద్ లోని మలక్‌పేట యశోధ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి సతీష్‌బాబు, దేవాలయ అర్చకులు రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, ఉపాధ్యక్షులు బల్దూరి అంజయ్య, గుండు సైదయ్య, రుద్ర వెంకటేశ్వర్లు, కొంగరి శ్రీనివాస్, తొడుపునూరి కృష్ణమూర్తి, రేఖ సోమయ్య, కీత శ్రీనివాస్, మేళ్లచెరువు రామమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్‌కు 2026/27 సంవత్సరానికి గానూ జరగాల్సిన ఎన్నికల ప్రక్రీయ మంగళవారం ప్రారంభమైంది. బార్ అసోసియేషన్ ప్రస్తుత కార్యవర్గ సమ్మతితో ప్రధాన కార్యదర్శి చెనగాని యాదగిరి ఎన్నికల అధికారులుగా ఎంఎస్ రాఘవరావు, వట్టికూటి అంజయ్య లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల అధికారులు ఎన్నికల ప్రక్రీయలో భాగంగా బార్ అసోసియేషన్ నోటీస్ బోర్డుపై ఓటర్ లిస్టు ప్రదర్శించారు. కాగా బుధవారం రోజు ఎన్నికల నోటఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారులు ఎంఎస్ రాఘవరావు, వట్టికూటి అంజయ్యలు తెలిపారు.



## ఓటు హక్కుపై విస్తృత అవగాహన

**ప్రజాపక్షం/త్రిపురారం:** గ్రామస్థాయిలో ఓటు హక్కుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తహసీల్దార్ గాజుల ప్రమీల సూచించారు. మంగళవారం ఆదర్శ పాఠశాలలో మండల వ్యాప్తంగా బిఎల్‌ఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా నిర్వహణలో పారదర్శకత, ఖచ్చితత్వం ఎంతో కీలకమని పేర్కొన్నారు.ప్రతి బిఎల్‌ఓ తమ పరిధిలోని ఓటర్ల వివరాలను సమగ్రంగా నమోదు చేసి,ఎలాంటి తప్పులు లేకుండా జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. 18 ఏళ్లు పూర్తిచేసుకున్న ప్రతి యువత ఓటరుగా నమోదు అయ్యేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఓటు ప్రాముఖ్యతను వివరించాలని కోరారు.

## మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు




**ప్రజాపక్షం/త్రిపురారం:** రోడ్డుపై మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోకపోవడంతో వారి తల్లిదండ్రులపై సహితం కేసు నమోదు చేస్తామని హాలియా సిఐ సతీష్ రెడ్డి హెచ్చరించారు.మంగళవారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ముందు వాహనాలను తనిఖీలు చేయగా మైనర్లు నడుపుతున్న 18వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.మైనర్లు వాహనాలు నడిపితే 25 వేల రూపాయల జరిమానా విధిస్తామన్నారు. అన్ని రకాల వాహనాలకు వాహన పత్రాలు ఇన్సూరెన్స్ తప్పక చేయించుకొని అందుబాటులో ఉంచుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో ఎస్సై కె నరేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్‌కు ఘన నివాళి



**ప్రజాపక్షం/నకిరేకల్:** దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన విప్లవ వీరుడు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో భగత్‌సింగ్ యువజన మండలి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ ఆయన చిత్రపటానికి పూలమాలువేసి ఘనంగా ని నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు సంద్ర సంతోష్, పుట్ట నాగయ్య,యువజన క్లబ్ అధ్యక్షుడు అంబటి ఎల్లేష్,ఉపాధ్యక్షుడు వద్దే బోయిన శివ,సభ్యులు ఉపేందర్,నాగయ్య,నరేష్,గోపి,లక్ష్మణ్ ,సభ్యులు పాల్గొన్నారు.

## వరల్డ్ టిబి దినోత్సవం

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేటలోని బాలుర హై స్కూల్ లో మంగళవార వరల్డ్ టీబీ డే సందర్భంగా విద్యార్థులకు మండల వైద్యాధికారి డాక్టర్ అశ్విని కుమార్ ఆధ్వర్యంలో గోపాల్ హెచ్ ఈఓ,జాతీయ క్షయ రోగ నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. క్షయ రోగులపట్ల ఆధరాభిమానాలు చూపించిన పూర్తి చికిత్స తీసుకునేటట్లు చూడవలసిందిగా తెలియ జేస్తూ విద్యార్తులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మంజుల, హెడ్ మాస్టర్ ఎం.శేషచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** జాతీయ అంతర్జాతీయ స్థాయిలో జరిగే వివిధ రకాల పోటీ పరీక్షలలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని ప్రిన్సిపాల్ పోసాని వెంకట రమణరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు ఐఎన్‌టిఎస్‌వో ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైనల్ లెవెల్‌లో దాసరి తరుణి ల్యాప్‌టాప్, పోసాని మానస్ అరవింద్ ట్యాబ్, అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి గ్రాండ్ ప్రైజులు గోల్డ్ మెడల్ మెరిట్ సర్టిఫికెట్లు సాధించిన బహుమతులను పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో డిఎన్ ప్రేమ్‌సాగర్, రామకృష్ణారెడ్డి, నాగమల్లేశ్వరి, మాలకొండయ్య, బత్తిని శ్రీనివాస్, గోవర్ధన్, ప్రియాంక, గురవయ్య, హనుమ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నరేష్‌కు ఉత్తమ అవార్డు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గరిడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ వి.నరేష్‌కు ఉత్తమ సేవలందించినందుకు గానూ మంగళవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, డిఎంహెచ్‌వో ల చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్నారు. టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న కొత్తగూడెం గ్రామంలో గత మూడు సంవత్సరాల నుండి ఒక్క టిబి కేసు కూడా నమోదు కాలేదు. కావున కొత్తగూడెం గ్రామాన్ని టిబి లేని గ్రామంగా ప్రకటించడం జరిగిందని, అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నమోదైన టిబి కేసులకు సకాలంలో మందులు అందజేయడం, క్షయ వ్యాధిని నయం చేయడం అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించినందుకు గానూ అవార్డు అందజేసినట్లు డాక్టర్ వి.నరేష్ తెలిపారు.

## కోదాడ బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు ప్రధాన కార్యదర్శి పాలేటి నాగేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారి మాధవరపు రామకృష్ణలు మంగళవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో స్వీకరించారు. అధ్యక్ష పదవికి చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి ఒక్కరే నామినేషన్ వేయగా వైస్ ప్రెసిడెంట్ పదవికి ఉయ్యాల నర్సయ్య, గాలి శ్రీనివాసనాయుడు, గట్ల నర్సింహరావు, రామిశెట్టి రామకృష్ణ, సంపెట సుధాకర్, జాయింట్ సెక్రటరీ పదవికి షేక్ జానిపాషా, కోడూరి వెంకటేశ్వరరావు, లైబ్రరీ సెక్రటరీ పదవికి గాలి శ్రీనివాసనాయుడు, పిడతల హనుమంతరావు, ట్రెజరర్ పదవికి కోడూరి వెంకటేశ్వర్లు, ఎండి హుస్సేన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ పదవికి వెంకటాచలం, హనుమంతరావు, లేడి రిప్రజంట్ పదవికి ధనలక్ష్మి, దుర్గ పోటీలో ఉన్నారని అన్నారు. వీరితో పాటు 8ఈసి మెంబర్ పదవులకు పలువురు అభ్యర్థులు పోటీల్లో ఉన్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



## తెలుగులో ముస్లింవాద సాహిత్యం ఆరంభమైంది



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఖాదర్ మోహియొద్దీన్ రాసిన పుట్టుమచ్చ కావ్యంతో తెలుగులో ముస్లింవాద సాహిత్యం ఆరంభమైందనిప్రముఖ కవి, కథకుడు స్కైబాబ పేర్కొన్నారు.మంగళవారం పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగులో ముస్లింవాద సాహిత్యం వికాసం అనే అంశంపై విస్తృతోపన్యాసం జరిగింది. ఈసందర్భంగా ప్రముఖ కవి,కథకుడు స్కైబాబ పాల్గొని మాట్లాడుతూ మనది లౌకిక రాజ్యం కాబట్టి హిందూ ముస్లింలు బాయీ బాయీ గా కలిసుండాలని అన్నారు.ఖాదర్ మోహియొద్దీన్ రాసిన పుట్టుమచ్చ కావ్యంతో తెలుగులో ముస్లింవాద సాహిత్యం ఆరంభమైందని అన్నారు.నేను పుట్టక ముందే నా పేరు దేశ ద్రోహుల జాబితాలో చేర్చబడింది అనే వాక్యాలు చాలా ఆలోచింపజేశాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, తెలుగు విభాగం అధ్యక్షులు డాక్టర్ వెల్దండి శ్రీధర్,డాక్టర్ టి.సైదులు,వాస భూపాల్,ప్రభాకర్,లింగస్వామి,శ్రవణ్ కుమార్, వనజ, హిందీ అధ్యాపకులు నాజియా,ఉర్దూ అధ్యాపకులు నస్రీన్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వ్యాలిడేషన్ యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ నేడు ఇందిరాపార్క్ వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని టాప్రా రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన యుటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లపై కక్ష సాధింపుగా వ్యవహరిస్తుందని, అందులో భాగంగానే పెన్షనర్లకు ఇచ్చే పెన్షన్ రెండు భాగాలుగా విభజించిందని, 2025వరకు విరమణ చేసిన ఉద్యోగులకు మరొక విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందని, ఇది పెన్షనర్ల జీవితాలతో చెలగాటమాడడమేనన్నారు. గతంలో సీపీఎస్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకే వర్తించేదని, తరువాత అన్ని రాష్ట్రాల్లో దాన్ని అమలు చేశారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను, పీఆర్‌సీ వెంటనే ఇవ్వాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 25న హైద్రాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. జగదీష్‌చంద్ర, శ్యాంసుందర్, అబ్దుల్‌ఖాదర్ పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్‌లో ఎస్‌పిఎఫ్ పోలీసుల సేవాభావం



**ప్రజాపక్షం/నందికొండ:** ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నాగార్జునసాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిలో తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పిఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 29 మంది ఎస్‌పిఎఫ్ పోలీసులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.రక్తదాతలకు మహారాజుల సేవా సంఘం సభ్యులు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేసి అభినందించారు. ఎస్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డి.వి భాస్కరరావు మాట్లాడుతూ రక్తదానం మహోన్నత సేవ అని, ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను కాపాడగలదని తెలిపారు. డ్యాం ఆర్ఐజీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం ప్రాణాధారమని పేర్కొన్నారు.కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రి సీఎంఓ డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ రక్తదానం వల్ల రక్త నిల్వలు సమృద్ధిగా ఉండి అనేక ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో డ్యాం ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాసరావు,జెన్‌కో ఇన్స్పెక్టర్ ఎన్.ఎస్. ప్రతాప్ నాయుడు, డాక్టర్ జయంత్ అభయానందన్, రక్త నిల్వ కేంద్ర సిబ్బంది వీరబాబు,ఏ.రాజు,దుర్గయ్య,మహారాజుల సేవా సంఘం సభ్యులు నకులరావు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలపై అవగాహన




**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో జాతీయ సేవా పథకం మరియు జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల పట్ల అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రధానా చార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ ఒకేసారి ఉపయోగించే ప్లాస్టిక్ పదార్థాల ను వాడకుండా వాటికి బదులుగా బట్టతో లేదా చెక్కతో తయారుచేసిన వస్తువు లను మాత్రమే ఉపయోగించడం మంచిదని అన్నారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్ట్ విశ్లేషకులు డి.తేజస్వి,ఎన్.అజిత్ మాట్లాడుతూ ఈనాడు ప్లాస్టిక్ భూతం సమా జాన్ని పట్టిపీడిస్తున్న సందర్భంలో దాని నుండి ప్రాణికోటి బయటపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు,ఐ క్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మి నీలిమ, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. చిన్న బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ జి.సునీత, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సిహెచ్.వెంకట్ గౌడ్,డాక్టర్ డి. కిషన్, డాక్టర్ పి.బ్రహ్మం పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హమాలి సంఘం నూతన కమిటీ ని మాజీ అధ్యక్షులు లోడి ఐలయ్య అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా బండ శ్రీను, ఉపాధ్యక్షులుగా బత్తిని నర్సయ్య, కార్యదర్శిగా దొంతి నర్సయ్య, కోశాధికారిగా కూరేళ్ళ రవి, సలహాదారులుగా పంజాల వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు జెట్ట శ్రీను, మాధ సోములు. బూడిద రాజు, లోడి నాగరాజు లను ఎన్నుకున్నారు.



## నగదు బహుమతి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** కబడ్డీ క్రీడల్లో గెలుపొంది బహుమతి కింద పొందిన నగదు నుండి గుండె వ్యాధితో బాధపడుతూ ఆపరేషన్ కోసం బాధితుడికి ఆర్థిక సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. దేశ్ముఖి క్రీడాకారులు ఇటీవల కేంద్ర క్రీడా శాఖ ఆధ్వర్యంలో అసెంబ్లీ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో పోచంపల్లి మండలం దేశ్ముఖి గ్రామానికి చెందిన యువ టీం మొదటి స్థానంలో నిలిచి ఆదివారం గవర్నర్ శివప్రసాద్ శుక్లజి, డా.లక్ష్మ ణ్, మాజీ ఎంపీ బుర్ర నర్సయ్య గౌడ్ ద్వారా షీల్డ్‌తో పాటు రూ.50 వేల నగదు అందుకున్నారు. అదే గ్రామానికి చెందిన చింతపట్ల శివకు హార్ట్ ఆపరేషన్ చేసుకునే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని తెలుసుకున్న కబడ్డీ టీం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పడమటి జగన్మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్, మాజీ మండల ప్రెసిడెంట్ బిజెపి గుండ్ల రాజు యాదవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే జీవితంలో ఏదైనా సాధించొచ్చు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని మిర్యాలగూడ మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ అన్నారు. ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ అకాడమి ఆఫ్ పీడియాట్రిషియన్స్, అర్చన పిల్లల వైద్యశాల సంయుక్తంగా మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత రక్త పర్సంటేజ్ పరీక్షల వైద్య శిబిరం నిర్వహించగా ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు బయటి ఆహార పదార్థాలు తినకుండా ఇంట్లో వండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు. తాను చదివిన పాఠశాలకు ముఖ్య అతిథిగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ నాయకులు చిలుకూరి బాలకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, డాక్టర్ అంజయ్య, రిటైర్డ్ హెచ్ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిచేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని మాజీ జడ్పిటిసి బచ్చలకూర మట్టయ్య, సర్పంచ్ గుగులోతు లక్పతి నాయక్ లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శీతలతండా గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధుల కింద మంజూరైన సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో గ్రామానికి మరిన్ని నిధులు మంజూరి చేయించి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శౌరి, హుస్సేన్, నీలావతి, కృష్ణ, గుగులోతు వెంకటేశ్వర్లు, మిట్టా నాయక్, గుగులోతు బాబునాయక్ పాల్గొన్నారు.

## బిఎల్ఓలకు శిక్షణ

**ప్రజాపక్షం/డిండి;** మంగళవారం డిండి ఎంపిడిఓ కార్యాలయంలో మండలంలోని బిఎల్‌ఓలకు మాస్టర్ ట్రైనర్స్ ఎస్ ఐ ఆర్ పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల తహశీల్దార్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ బిఎల్‌ఓలకు ఎస్ ఐ ఆర్ పై హౌస్ టు హౌస్ సర్వేపై పలు సూచనలు సలహాలు అందించారు. ఈకార్యక్రమంలో బిఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, బిపిఓలు పాల్గొన్నారు.



## ఎస్సీ, ఎస్టీ చైర్మన్‌ను కలిసిన ఒగ్గు పాండు

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని మగ్గంపల్లి గ్రామంలో ఇటీవల కొంతమంది కులం పేరుతో దూషించి దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ చైర్మన్‌ను మంగళవారం కలిసినట్లు మాజీ సర్పంచ్ ఒగ్గు పాండు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ హత్యా ప్రయత్నానికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టి కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ చైర్మన్‌ను కోరారు. చైర్మన్ వెంటనే భువనగిరి డిఏస్పిని కోరినట్లుగా పాండు విలేకరులకు తెలిపారు.

## ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని మల్కాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సోన్నాయిల రఘు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులందరూ తమ పశువులకు టీకాలను వేయించాలని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో 122 పశువులకు టీకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆకుల బాలయ్య,వార్డు సభ్యులు తోడేటి సత్యనారాయణ, పశు వైద్య సిబ్బంది ఎల్ ఎస్ ఏ శేఖర్,వెటర్నరీ అసిస్టెంట్ రాఘవేందర్ ,శంషొద్దీన్ ,బైఫ్ పెండెం ప్రవీణ్, గోపాల మిత్ర వీరు సత్యనారాయణ, శ్రీకాంత్ ,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెరుల ముందస్తు అరెస్ట్

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని పిలుపునిచ్చిన సందర్భంగా మంగళవారం ఉదయం తుర్కపల్లి మండలం పోలీస్ స్టేషన్ కు తుర్కపల్లి మండల నాయకులను తరలించడం జరిగిందని, ఇదివరకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో లో పెట్టినటువంటి వడ్డెర కార్పొరేషన్ కి 1000 కోట్ల బడ్జెట్‌ను మంజూరు కేటాయిస్తానని చెప్పి గాలికి వదిలేసిన ప్రభుత్వం అని, వడ్డెరలను బీసీ ఏ నుండి తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగిందని తెలిపారు. అరెస్టైన వారిలో వడ్డెర సంఘం నాయకులు ఓర్సు బిక్షపతి, వల్లెపు మహేందర్, ఇరగదిండ్ల కరుణాకర్ ఉన్నారు.




## యూనిప్యాడ్ల ఆవశ్యకతపై విద్యార్థినీలకు అవగాహన



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలోని పాఠశాలల్లో బాలికా విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాజెక్ట్ శక్తి కార్యక్రమం నిర్వహించారు.రోటరీ క్లబ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు యూనిప్యాడ్‌లు పంపిణీ చేసి,వాటి వినియోగం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా నిపుణులు మాట్లాడుతూ యూనిప్యాడ్‌ల వినియోగం బాలికల వ్యక్తిగత పరిశుభ్రతకు ఎంతో ముఖ్యమని,అనేక ఆరోగ్య సమస్యలను నివారించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. రోటరీ క్లబ్ మేనేజర్ మరియు ఎస్‌బీఐ నాంపల్లి మేనేజర్ ఎమ్.నాగరాజు,మండల విద్యా శాఖ తరఫున మండల విద్యాధికారి కె. మల్లిఖార్జున రావు కార్యక్రమానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బాలికల ఆరోగ్యం కోసం ఆర్థిక సహాయం అందించిన రోటరీ క్లబ్, ఆర్‌టీఎం పద్మశ్రీతో పాటు స్కూల్ మహిళా ప్రతినిధులు శిరీష, మృదులా, నాన్సీ, రమాదేవి,ఉజ్వల,ఉపాధ్యాయురాలు, ప్రధానోపాధ్యాయులు అజయ్ కుమార్,రాజశేఖర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం




**ప్రజాపక్షం/నాంపల్లి:** బాల్యవివాహాల వల్ల బాలికలకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని నేవిళ్లగూడెం సర్పంచ్ ఏరెడ్ల నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దామెర,నేవిళ్లగూడెం గ్రామాల్లో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న బాల్యవివాహాల ప్రభావం గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని చెప్పారు. బాలలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో గ్రామస్థాయి కమిటీల పాత్ర కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏరెడ్ల నారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అశోక్, అంగన్‌వాడీ టీచర్లు పూలగొని భాగ్యమ్మ, తల్లోజి యాదమ్మ, ఏరెడ్ల విజయ, నక్క కవిత, బలుసుల శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి,మంత్రి కోమటిరెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయడం హర్షణీయమని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి రెడ్డి,కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా చైర్మన్ నాంపల్లి నరసింహ అన్నారు.అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లు క్యాబినెట్‌లో ఆమోదం పొందిన సందర్భంగా కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలోని కోర్టు వద్ద సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ ఎండి అఫ్రోజ్ ఖాన్,న్యాయవాదులు నేతి రఘుపతి,నాంపల్లి భాగ్య,సత్తయ్య,నాగిరెడ్డి,ప్రసన్న,లెనిన్ పాల్గొన్నారు.

## క్షయరహిత గ్రామాలకు అవార్డులు అందజేత



**ప్రజాపక్షం/నూతనకల్ :** జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో జరిగిన క్షయ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లాలోని 25 గ్రామ పంచాయితీలను క్షయ రహిత గ్రామాలుగా ప్రకటించగా మండలంలోని చిల్పకుంట్ల, కొత్తతండ, అలుగునూరు గ్రామాలు ఎంపికై అవార్డులు పొందాయి. కాగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేతుల మీదుగా మంగళవారం ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు అవార్డులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

## వీర హనుమాన్ విజయాత్ర సన్నాహక సమావేశం..



**ప్రజాపక్షం/భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణం:** భువనగిరి పట్టణం ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోల శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన జరిగిన వీర హనుమాన్ విజయాత్ర ర్యాలీ సన్నాహక సమావేశం నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గీస ఆనంద్ మాట్లాడుతూ త్యాగమయ జీవితంలో మానవ సమాజానికి ఆదర్శమూర్తిగా కొనియాడబడుతూ చిరంజీవిగా నిలిచిన. వీర హనుమాన్ విజయ యాత్ర ర్యాలీ సందర్భంగా ధర్మ రక్షణలో హనుమంతుడు చూపిన దారిలో రామ రాజ్య స్థాపనకై అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా బజరంగ్ దళ్ కన్వీనర్ బింగి భరత్ కుమార్ మాట్లాడుతూ హనుమంతుడిని ఆదర్శంగా తీసుకొని భువనగిరి పట్టణంలో ఏప్రిల్ 2 తారీకు గురువారం రోజు జరగబోయే ర్యాలీలో నేటి యువత కదిలి వచ్చి శక్తి ప్రదర్శన చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ బాదం ప్రకాష్ జి, విభాగ్ సహకార్యవహ తాడెం పాండుజి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాస్కర్ పాల్గొన్నారు.



## కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బస్వాపురం ప్రాజెక్టుకు కాళేశ్వరం నీళ్లు వస్తున్నాయంటే కెసిఆర్, పిఎస్ఆర్ పుణ్యమే అని బిఆర్ఎస్ భువనగిరి మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు అన్నారు. భువనగిరి మండల పరిధిలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ ఈర్ల కృష్ణ ఆధ్వర్యంలో గౌస్ నగర్ గ్రామంలో కెనాల్ వద్ద నీళ్లు ప్రవహిస్తున్న సందర్భంగా గ్రామ రైతుల తోటి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కంచి మల్లయ్య, గ్రామ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నలమస్ కుమార్ గౌడ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## బీర్ల ఐలయ్యను విమర్శిస్తే సహించం



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య గారిని విమర్శిస్తే సహించేది లేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి అన్నారు.మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో అధికారంలో లేకపోయినా రాష్ట్రంలో ఏ నాయకుడు కరోనా సమయంలో చేయలేని ప్రజాసేవా ప్రతి గామ గ్రామంలో ఆలేరు నియోజక వర్గ వ్యాప్తంగా నిత్యావసర సరుకులు, మాస్కులు, వాటర్ ప్లాంట్ లు,మంచి నీళ్ల క్యాన్లు,అంబులెన్సు సౌకర్యం కల్పించిన మహా నాయకుడని వారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొడిత్యాల నరేందర్ గుప్తా,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు,ప్రధాన కార్యదర్శి కందడి అనంత రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మండలంలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు కుమ్మరి వెంకన్న ఇటీవల మరణించడంతో మంగళవారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ వారి కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం మండలంలోని గానుగబండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు బత్తుల శివ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములు గౌడ్, తకడమళ్ల రవికుమార్, గోపగాని రమేష్ పాల్గొన్నారు.

## టిబి రహిత గ్రామ పంచాయతీలకు అవార్డులు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండలంలోని ఉయ్యాలవాడ, అడివెంల, నాన్యతండ గ్రామ పంచాయితీలు టిబి రహిత గ్రామ పంచాయితీలుగా ఎంపికయ్యాయని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్ నాయక్ తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా మంగళవారం సూర్యాపేటలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆయా గ్రామాల సర్పంచులు పాశం కరుణ, కలకోట్ల శైలేందర్, కేలోతు కాంతమ్మలు, పంచాయితీ కార్యదర్శులతో కలిసి అవార్డులను అందుకున్నారని తెలిపారు.





## భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీఐటీయూ మల్లు గౌతంరెడ్డి అన్నారు. భగత్‌సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలో చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కోడిరెక్క మల్లయ్య, చిన్నమట్టయ్య, తాళ్లపల్లి నాగయ్య, నూనె రాజరత్నం, పెరుమాళ్ల వెంకన్న, భాగ్య, అమర్‌నాద్, అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సిసిరోడ్లు నిర్మాణం



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మండలం ఆరెగూడెం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో డీసీసీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలన్న సహకారంతో ఆరేగూడెం సర్పంచ్ పేరబోయిన దివ్య మకరజ్యోతి కార్తీక్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గం సభ్యులు ఉపసర్పంచ్ లత, నాగరాజు వార్డు సభ్యులు బరిగెల వెంకటేష్, పుల్లె భాస్కర్, కొల్లూరి అంజనేయులు, కొల్లూరి శ్రీహరి, పేరబోయిన మాధురి శ్రీకాంత్, మోటకొండూర్ మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు కొల్లూరి హరిబాబు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగిగా మహేష్



**ప్రజాపక్షం/నూతనకల్ :** నూతన్‌కల్ మండలంలోని సోమ్లతండకు చెందిన గుగులోతు మహేష్‌కు ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్నారు. మంగళవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుప్రతిలో డిఆర్‌టిబి విభాగంలో పనిచేస్తున్న గుగులోతు మహేష్ జిల్లాస్థాయి ఉత్తమ ఉద్యోగి అవార్డును, ప్రశంసా పత్రాన్ని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను అధికారులు, మండల నాయకులు, గ్రామస్తులు అభినందించారు.

## సామాజిక తనిఖీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక ఎంపీడీవో కార్యాలయ హాల్‌లో 2025/26 ఆర్ధిక సంవత్సరానికి ఎంజీఎన్ఆర్‌జీఎస్ కింద సుమారు రూ.11కోట్ల వ్యయంతో 395 పనులపై సామాజిక తనిఖీ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వై.శేఖర్‌రెడ్డి సమక్షంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ మిర్యాలగూడ మండలంలో పనులు జరిగిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పనులు సమర్ధవంతంగా చేయాలన్నారు. జరిగిన పనులపై ఎంపీడీవో ఎం.శేషగిరిశర్మ, ఏపీపవో సూరానాయక్, నివేదించారు. కార్యక్రమంలో ఈసీ ఎం.కళావతి, రేణుక, టీఏలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఆడిట్ బృందం పాల్గొన్నారు.

## వడ్డెర్ల అసెంబ్లీ ముట్టడికి బిసి జాగృతి మద్దతు





**ప్రజాపక్షం/మోటకొండూర్ :** వడ్డెరలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయా లని,వడ్డేరలను ఎస్ టి జాబితా చేర్చుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి అధికారంలో రాగానే వడ్డెరలను మర్చిపోయారని వడ్డెర సంఘం రాష్ట్ర నాయ కులు తెలంగాణ జాగృతి నాయకులు ఎత్తరి గణేష్ అన్నారు. ఆయన మంగళవారంవడ్డెర సంఘం ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి ఉన్నందున మోట కొండూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారని, ముందస్తు అరేస్టులు చేయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్ర మంలో వడ్డెర సంఘం నాయకులు రాపోలు ఎలేందర్, రాపోలు దుర్గయ్య, రాపోలు శ్రీకాంత్,ఎత్తరి బుచ్చిరాములు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మన వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు అసెంబ్లీ ముట్టడికి యాదాద్రి జిల్లా వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు బోదాసు చిన్న ఈదయ పోచంపల్లి మండల వడ్డెర సంఘం అధ్యక్షులు బోదాస్ రమేష్, దంతూరు వడ్డెర సంఘం అధ్యక్షులు బోదాస్ పెద్ద ఈదయ్య ఉపాధ్యక్షులు బోదాస్ వెంకటేశం, ప్రధాన కార్యదర్శి బోదాస్ లక్ష్మీ నారాయణ, మరి బోదాస్ బాలరాజ్, దంతూరు నుండి బయలుదేరుతుండగా పోచంపల్లి మండల పోలీస్ స్టేషన్ ఎస్సై భాస్కర్ రెడ్డి పోలీస్ సిబ్బంది మంగళవారం అడ్డుకొని అరెస్టు చేశారు.

## తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ క్షేత్ర పర్యటన ప్రోగ్రాంలో భాగంగా భువనగిరి మండల పరిధిలోని గంగసానిపల్లి, ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో ఘన వ్యర్థాలను వేరు చేయు విధానంపై వాత్సల్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ముత్తిరెడ్డిగూడెంలో ఉన్న ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించారు. తడి, పొడి చెత్త వేరు చేయడం కంపోస్టు ఎరువు తయారీ విధానాన్ని ముఖ్య అతిథులుగా వచ్చిన టి.ఎన్.జి.సి కోఆర్డినేటర్ సూర్య కిరణ్, వాత్సల్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మరియు స్వచ్ఛ భారత్ మిషన్ ఎస్.బి.ఎమ్. జిల్లా కోఆర్డినేటర్ మిర్యాల మురళి, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ రాంపల్లి కృష్ణ, ఉప సర్పంచ్ అందే మల్లేష్, ప్రిన్సిపల్ దరిపల్లి ప్రవీణ్ కుమార్, వార్డ్ సభ్యులు జక్కుల మల్లేష్, కొండమడుగు అశోక్, పంచాయతీ కార్యదర్శి కంచుగల్ల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అరెస్టు



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలంలో టిఆర్ఎస్‌వి విద్యార్థి విభాగం విద్యార్థుల సమస్యలపై ఫీజు రీఎంబర్స్ పై అసెంబ్లీ ముట్టడి పిలిపించిన నేపథ్యంలో రామన్నపేట పోలీసులు ఉదయం టిఆర్ఎస్వీమండల అధ్యక్షుని ఇంటి వద్దకు మరియు మిగతా నాయకుల ఇండ్ల వద్దకు వెళ్లి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకురావడం జరిగింది. అరెస్ట్ అయిన వారు బిఆర్ఎస్‌వి మండల అధ్యక్షుడు జాల అమరేందర్ రెడ్డి, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు ఆవుల శ్రీధర్, వార్డు మెంబర్ నల్ల సైదులు, నాయకులు చెరుకు ఉపేందర్, కొండగడప చింటూ ఉన్నారు.

## స్కూల్‌కు వెళ్లడానికే భయం టీచర్ల వేదన! లివింగ్ ట్రీ హై స్కూల్లో వేధింపుల కలకలం



**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు మండలంలోని మందనపల్లి గ్రామంలోని లివింగ్ ట్రీ డిస్కవరీ హై స్కూల్లో ఉపాధ్యాయులపై జరుగుతున్న వేధింపుల వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్గా పనిచేస్తున్న రమేష్ ప్రవర్తనపై ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా మహిళా ఉపాధ్యాయులపై రమేష్ అనుచితంగా ప్రవర్తిస్తూ, తిట్టడం, అవమానించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తన మాట వినని టీచర్లపై కక్ష సాధింపుగా ప్రవర్తిస్తూ, ప్రిన్సిపల్కు లేనిపోని ఫిర్యాదులు చేసి వారిని ఉద్యోగాల నుంచి తొలగింపజేసిన ఘటనలు అనేకం జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు సుమారు 20 మందికి పైగా టీచర్లు ఈ వేధింపుల కారణంగా ఉద్యోగాలు కోల్పోయినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం పనిచేస్తున్న టీచర్లు తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నారు. స్కూల్కి వెళ్లి పాఠాలు చెప్పాలంటేనే భయం వేస్తోంది& రమేష్ వల్ల ఎన్నో అవమానాలు ఎదుర్కొంటున్నాం అంటూ బాధితులు వాపోతున్నారు. రమేష్ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మీడియా స్కూల్ను సందర్శించగా, ప్రిన్సిపల్ అందుబాటులో లేకపోవడం గమనార్హం. ప్రిన్సిపల్ ఎప్పుడు వస్తారో తెలియదు, నేను బిజీగా ఉన్నాను అంటూ రమేష్ సమాధానం ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. అయితే మీడియా వెళ్లిన కొద్దిసేపటికే ప్రిన్సిపల్ స్కూల్కు చేరుకోవడం పరిస్థితిపై మరిన్ని సందేహాలను రేకెత్తిస్తోంది. ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని, బాధిత టీచర్లకు రక్షణ కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, స్కూల్లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఉపాధ్యాయులు భయంతో బోధన చేయాల్సిన పరిస్థితి వస్తే, విద్యా వ్యవస్థపై నమ్మకం ఎలా నిలుస్తుంది? టీచర్ల గౌరవం, భద్రత కాపాడడం ప్రభుత్వ బాధ్యత కాదా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



## కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట పట్టణంలోని 26వ వార్డు కౌన్సిలర్ పలగాని మాధవి కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు పార్టీ కార్యాలయాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, వైస్ చైర్మన్ ఎండి షఫీఉల్లా, మార్కెట్ కమిటి చైర్మన్ గట్టు శ్రీనివాస్, నాయకులు పోతు భాస్కర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా స్వామి కల్యాణం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా కేంద్రంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవం మంగళవారం టిపిసిసి ఎన్నికల ప్రచార కమిటి కన్వీనర్ పృధ్వీరాజ్ నాయక్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వేద పండితులచే వేదమంత్రోచ్చరణతో స్వామి వారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.

## బెల్లి జనార్ధన్ ఆకస్మిక మృతి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఇటీవల తూలికా తనిస్క్ క్రియేషన్స్ పతాకంపై పోలీస్ వారి హెచ్చరిక చిత్రాన్ని నిర్మించడం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన బెల్లి జనార్ధన్ ఆకస్మిక మరణం పట్ల చిత్ర దర్శకుడు బాబ్జీ తీవ్ర సంతాపాన్ని వ్యక్తపరిచారు.ఈనెల 22వ తేదీన ఉగాది పండుగ జరుపుకోవడం కోసం అత్తగారి ఊరైన కట్టంగూరు కు తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్ళిన బెల్లి జనార్ధన్ ఆగ్రామంలో గల స్విమ్మింగ్ పూల్ లో ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు నీటి అడుగుకు బలంగా తల తగిలి తీంవ్రగా గాయమవడంతో అక్కడికక్కడే ఊపిరి వదిలారు.ఈ సందర్భంగాపోలీస్ వారి హెచ్చరిక సినిమా యూనిట్ తరుపున,వ్యక్తి గతంగా నా తరుపున నిర్మాత బెల్లి జనార్ధన్ ఆకస్మిక మరణం పట్ల తీవ్రమైన దిగ్భ్రాంతిని వ్యక్తపరుస్తూ వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలుపుకుంటున్నామని దర్శకుడు బాబ్జీ తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని రాఘవపూర్ గ్రామంలో మంగళవారం హిందూ వేరు పరిశ్రమ వారి ఆధ్వర్యంలో రోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పొట్టోల్ల శ్యామ్ గౌడ్ ఉచిత శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇలాంటి వైద్య శిబిరాలు మరిన్ని జరపాలని పరిశ్రమ యాజమాన్యాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. అనంతరం సుమారు 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ రమేష్ బాబు, డాక్టర్ నికితా, వార్డు సభ్యులుపాల్గొన్నారు.

